సాక్షి
ఆదిలాబాద్
గురువారం । 9 । మార్చి । 2023



హ్యాండ్‌బాల్ ఉమ్మడి జిల్లా జట్టు ఎంపిక 10లో▸

మంచిర్యాల జిల్లాలో బుధవారం సబ్ జూనియర్ బాలుర హ్యాండ్‌బాల్ ఉమ్మడి జిల్లా జట్టు ఎంపిక పోటీలు నిర్వహించారు.



ఉత్తమ ఫలితాల కోసం.. 8లో▸

పదో తరగతి వార్షిక పరీక్షల్లో వంద శాతం ఫలితాలు సాధించేందుకు గిరిజన సంక్షేమ శాఖ చర్యలు చేపడుతోంది. ఇప్పటికే మిషన్ లక్ష్యం అమలు చేస్తుండగా.. తాజాగా విద్యార్థులకు అభ్యాస దీపికలు అందజేసింది.

గరిష్ఠం/కనిష్ఠం
35.0/20.0

వాతావరణం

వాతావరణం పొడిగా ఉంటుంది. గాలిలో తేమశాతం తగ్గనుంది. ఉక్కపోత ప్రభావం అధికంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

మహిళలు అన్నిరంగాల్లో ముందుండాలి



మాట్లాడుతున్న జిల్లా జడ్జి ఎంఆర్ సునీత

ఆదిలాబాద్‌టౌన్: మహిళలు అన్నిరంగాల్లో ముందుండాలని జిల్లా జడ్జి ఎంఆర్ సునీత అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలోని కోర్టులో బుధవారం వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడారు. ఆడ, మగ అనే తేడా లేకుండా ఇద్దరిని సమానంగా చూడాలన్నారు. ఆడపిల్లలకు ఉన్నత చదువు చదివించి వారి భవిష్యత్‌ను తీర్చిదిద్దాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా మొదటి అదనపు జడ్జి మాధవీకృష్ణ, ఎస్సీ, ఎస్టీ కోర్టు జడ్జి సతీశ్, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి క్షమాదేశ్ పాండే, సీనియర్ సివిల్ జడ్జి ప్రమీళ జైన్, జూనియర్ సివిల్ జడ్జి మంజుల సూర్యవార్, జడ్జీలు యశ్వంత్‌సింగ్ చౌహాన్ పాల్గొన్నారు.

చదువుతోనే మహిళా సాధికారత



డీఈవోను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

ఆదిలాబాద్‌అర్బన్: చదువుతోనే మహిళా సాధికారత సాధ్యమవుతుందని డీఈవో ప్రణీత అన్నారు. టీయూటీఎఫ్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో వారి కార్యలయంలో మహిళా దినోత్సవంను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడారు. ఆడ, మగ తేడా లేకుండా పిల్లలకు నాణ్యమైన విద్య అందించాలన్నారు. అంతకు ముందు మహిళా ఉపాధ్యాయులు డీఈవోను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు లచ్చిరాం, రాష్ట్ర సహాధ్యక్షులు ఆర్.సుజాత, అరుణ, అంజనాదేవి, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్.శ్రీకాంత్, ఎం.జలంధర్‌రెడ్డి, మహిళా ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

14న పట్టుబడిన వాహనాలకు వేలం

ఆదిలాబాద్‌అర్బన్: ఆదిలాబాద్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలను ఈ నెల 14న ఆదిలాబాద్‌లోని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కార్యాలయ ఆవరణలో వేలం వేయనున్నట్లు జిల్లా ఎక్సైజ్ అధికారి హిమశ్రీ ప్రకటనలో తెలిపారు. ఏడు ద్విచక్ర వాహనాలు, ఒక సుమో, ఒక ఆటోకు వేలం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల వారు ప్రభుత్వం నిర్దేశించిన ధరావత్ సొమ్ము చెల్లించి వేలంలో పాల్గొనవచ్చని సూచించారు.



భోరజ్ సమీకృత చెక్‌పోస్టు

భోరజ్ విచారణ పూర్తి

- సీనియర్ ఎంవీఐ, మిగతా అధికారుల మధ్య వివాదంపై..
- రవాణా శాఖ కమిషనర్‌కు నివేదిక
- తదుపరి చర్యలపై ఆసక్తి
- చెక్‌పోస్టులో మళ్లీ సాధారణ పరిస్థితులు

సాక్షి,ఆదిలాబాద్: భోరజ్ చెక్‌పోస్టులో దుమారం లేపిన సీనియర్ ఎంవీఐ వర్సెస్ మిగతా మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ల మధ్య వివాదానికి సంబంధించి రవాణా శాఖ పరంగా విచారణ పూర్తయినట్లు తెలుస్తోంది. ఉప రవాణా శాఖ అధికారి పుప్పాల శ్రీనివాస్ ఇటీవల ఈ ఇన్‌స్పెక్టర్లందరినీ కలిసి విచారించినట్లు సమాచారం. దీనిపై ఓ నివేదిక తయారు చేసి రాష్ట్ర రవాణా శాఖ కమిషనర్ జ్యోతిబుద్ధప్రకాశ్‌కు పంపినట్లు తెలుస్తోంది. అయితే ఈ విషయంలో వివరాలను గోప్యంగా ఉంచారు. వివరణ కోరేందుకు 'సాక్షి' యత్నించగా అధికారులు అందుబాటులోకి రాలేదు. కాగా తదుపరి ఎలాంటి చర్యలు ఉంటాయనేది ఆసక్తి కలిగిస్తుంది.

తదుపరి ఏం జరుగుతుందో..

జిల్లాలోని జైనథ్ మండలం భోరజ్ వద్ద జాతీయ రహదారి 44పై రవాణా శాఖకు సంబంధించి సమీకృత చెక్‌పోస్టు ఉంది. ఈ రహదారి పైనుంచి నిత్యం వేలాది వాహనాలు పయనిస్తుంటాయి. ఈ మార్గం గుండా వెళ్లే వాహనాలకు సంబంధించి పర్మిట్, ఓవర్‌లోడ్, లైసెన్స్‌లు, ట్యాక్స్‌లు, ఇతరత్రా పత్రాలు సరిగ్గా ఉన్నాయా లేదా అనేది చెక్‌చేసి పంపాలి. 24 గంటల పాటు ఇక్కడినుంచి వచ్చిపోయే వాహనాల తనిఖీతో సందడిగా ఉంటుంది. అయితే చెక్‌పోస్టులో రెగ్యులర్ ఎంవీఐలు, ఏఎంవీఐ పోస్టులకు అదనంగా పలువురిని ఆన్‌డ్యూటీ, పూర్తి అదనపు బాధ్యతలతో రెట్టింపు స్థాయిలో ఇక్కడ విధులు నిర్వహించేందుకు పంపించడమే వివాదానికి కారణమైంది. ఓ సీనియర్ ఎంవీఐ ఈ విషయంలో మిగతా మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్లతో ఏడాది కాలంగా ఈ వివాదానికి దిగడం జరిగింది. గత నెలలో ఇది మరింత ముదిరింది. సదరు సీనియర్ ఎంవీఐ బెదిరింపులకు పాల్పడుతున్నాడని మిగతా మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్లు చెక్‌పోస్టులో డ్యూటీ విషయంలో అంటీ అంటనట్టుగా వ్యవహరిస్తూ వచ్చారు. అంతే కాకుండా ముఖ్యమంత్రి కేసీఆర్, మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్, రవాణాశాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, దేవాదాయ శాఖ మంత్రి ఐకే రెడ్డి, ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న, రవాణా శాఖ కమిషనర్ జ్యోతిబుద్ధప్రకాశ్‌కు అప్పట్లో ఫిర్యాదు చేశారు.దీనిపై కమిషనర్ విచారణకు ఆదేశిస్తూ జిల్లా ఉప రవాణా శాఖ అధికారి పుప్పాల శ్రీనివాస్‌ను విచారణ అధికారిగా నియమించారు. ఇటీవల ఆయన చెక్‌పోస్టు అధికారులను కలిసి విచారణ జరిపి నివేదిక తయారు చేసి పైకి పంపినట్లు తెలుస్తోంది.

చెక్‌పోస్టులో సాధారణ పరిస్థితులు..

భోరజ్ చెక్‌పోస్టులో మళ్లీ సాధారణ పరిస్థితులు నెలకొన్నాయి. గత నెలలో సీనియర్ ఎంవీఐ తనకు అదనంగా డ్యూటీలు కేటాయించాలని, లేనిపక్షంలో ఒక్కో మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ లక్షల రూపాయలు ముట్టజెప్పాలంటూ బెదిరింపులకు పాల్పడుతున్నాడని మిగతా వారు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. అంతేకాకుండా తన మాట కాదని ఇష్టారీతిన వ్యవహరిస్తే ఏసీబీ, విజిలెన్స్ దాడులు చేయిస్తానని సదరు అధికారి బెదిరించాడని ఇక్కడ పనిచేసే వారందరు 'మామూళ్ల' జోలికి వెళ్లేందుకు సాహసించలేదు. తాజాగా చెక్‌పోస్టులో సాధారణ పరిస్థితులు నెలకొన్నట్టు తెలుస్తోంది. రవాణా శాఖ అధికారులు, సిబ్బంది మాత్రమే ప్రస్తుతం డ్యూటీలు నిర్వహిస్తున్నారు. ఇదివరకు ప్రైవేట్ సిబ్బంది ద్వారా ఈ చెక్‌పోస్టులో రవాణా శాఖ అధికారులు తతంగం కానిచ్చేవారు. ప్రస్తుతం ప్రైవేట్ సిబ్బంది ఇక్కడ కనిపించక పోయినా క్రమక్రమంగా సాధారణ పరిస్థితులు నెలకొంటున్నాయి. కాగా విచారణ విషయంపై డీటీసీ పుప్పాల శ్రీనివాస్‌ను వివరణ కోరేందుకు యత్నించగా ఆయన అందుబాటులోకి రాలేదు.

చెక్‌పోస్టులో డ్యూటీల వివాదం



- 'సాక్షి'లో వరుస కథనాలు..

భోరజ్ వివాదంపై ఫిబ్రవరి 23, 24, 25, 26 తేదీల్లో 'సాక్షి'లో వరుస కథనాలు ప్రచురితమయ్యాయి. ఇవి రవాణా శాఖ కమిషనర్ దృష్టికి వెళ్లాయి. దీనిపై స్పందించిన ఆయన విచారణకు ఆదేశించిన విషయం తెలిసిందే.

పకడ్బందీగా ఇంటర్ పరీక్షలు

- జిల్లాలో 30 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు
- అందుబాటులో హెల్ప్‌డెస్క్
- ఆన్‌లైన్ నుంచి హాల్‌టికెట్ డౌన్‌లోడ్ చేసుకోవచ్చు
- 'సాక్షి' ఇంటర్వ్యూలో డీఐఈవో రవీందర్‌కుమార్



రవీందర్‌కుమార్, డీఐఈవో

ఆదిలాబాద్‌టౌన్: ఇంటర్మీడియెట్ వార్షిక పరీక్షలు పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం.. అలాగే విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చర్యలు చేపడుతున్నట్లు డీఐఈవో రవీందర్ కుమార్ తెలిపారు. ఈ నెల 15నుంచి ఇంటర్ పరీక్షలు ప్రారంభం కానున్న నేపథ్యంలో 'సాక్షి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన పలు వివరాలు వెల్లడించారు.

సాక్షి: ఇంటర్ పరీక్షలు ఎప్పటి నుంచి ప్రారంభం కానున్నాయి?

డీఐఈవో: ప్రథమ, ద్వితీయ సంవత్సరంతో పాటు ఒకేషనల్ పరీక్షలు ఈ నెల 15 నుంచి షురూ కానున్నాయి. ఈనెల 29 వరకు కొనసాగుతాయి.

సాక్షి: పరీక్షల నిర్వహణ కోసం ఎలాంటి ఏర్పాట్లు చేశారు.. ఎంత మంది విద్యార్థులు హాజరుకానున్నారు?

డీఐఈవో: ఇంటర్ పరీక్షల కోసం జిల్లాలో 30 కేంద్రాలను ఏర్పాటు చేశాం. ప్రథమ సంవత్సరం జనరల్ విద్యార్థులు 8,297 మంది, ఒకేషనల్ విద్యార్థులు 1,095 మంది పరీక్షలు రాయనున్నారు. అలాగే ద్వితీయ సంవత్సరం జనరల్ విద్యార్థులు 8,791 మంది, ఒకేషనల్ విద్యార్థులు 1,002 మంది హాజరుకానున్నారు.

సాక్షి: మాస్ కాపీయింగ్ నిరోధించేందుకు ఎలాంటి చర్యలు చేపడుతున్నారు.?

డీఐఈవో: మాస్ కాపీయింగ్‌కు అవకాశం లేకుండా పకడ్బందీగా నిర్వహిస్తాం. ఇందుకోసం మూడు సిట్టింగ్ స్క్వాడ్, ఒక ఫ్లయింగ్ స్క్వాడ్ ఏర్పాటు చేశాం. అంతేకాకుండా డీఈసీ కమిటీ ఆయా పరీక్షా కేంద్రాలను తనిఖీ చేస్తుంది. పరీక్ష నిర్వహణ కోసం 30మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 30 మంది డిపార్ట్‌మెంట్ అధికా రులు, ఐదుగురు కస్టోడియన్లను ఏర్పాటు చేశాం. అలాగే ప్రశ్న పత్రాలను సీసీ కెమెరా నిఘాలో తెరవడం జరుగుతుంది.

సాక్షి: ఫీజు చెల్లించలేదని విద్యార్థులకు కొన్ని ప్రైవేట్ కళాశాలలు హాల్‌టికెట్లు ఇవ్వడం లేదు. ఎలాంటి చర్యలు చేపడుతారు.?

డీఐఈవో: ప్రైవేట్ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఫీజు చెల్లించలేదని హాల్ టికెట్లు ఇవ్వకుంటే ఆన్‌లైన్ నుంచి డౌన్‌లోడ్ చేసుకొని నేరుగా పరీక్షకు హాజరుకావచ్చు. హాల్‌టికెట్లపై ఎవరి అటెస్టెడ్ అవసరం లేదు.

సాక్షి: పరీక్షల సమయంలో విద్యార్థులకు ఇబ్బందులు కలిగితే ఎవరిని సంప్రదించాలి.?

డీఐఈవో: విద్యార్థులు ఇబ్బందులకు గురికాకుండా ఉండేందుకు హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేశాం. కార్యాలయంలో హెల్ప్‌లైన్ నంబర్ 08732-297115, 98481 87808 నంబర్‌లో సంప్రదించవచ్చు. అంతేకాకుండా dieo. adilabad. @gmail. com కు మెయిల్ చేయొచ్చు.

సాక్షి: విద్యార్థులకు మీరిచ్చే సలహా..?

డీఈఐవో: విద్యార్థులు భయపడకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాయాలి. కష్టపడి చదివి మంచి మార్కులు సాధించాలి. కాపీయింగ్‌కు పాల్పడి డిబార్ అయితే భవిష్యత్‌లో ఇబ్బందులు తప్పవు. పరీక్షా కేంద్రంలో తాగునీరు, ఇతర మౌలిక సౌకర్యాలతో పాటు వైద్య సిబ్బందిని ఏర్పాటు చేస్తాం. ఏ ఒక్క విద్యార్థి నేలపై కూర్చోకుండా ఫర్నిచర్ ఏర్పాటు చేస్తున్నాం. ఏవైనా ఇబ్బందులుంటే మా దృష్టికి తీసుకురావాలి.

నేటి నుంచి అందుబాటులోకి స్విమ్మింగ్ పూల్

ఆదిలాబాద్: జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో గల స్విమ్మింగ్‌పూల్‌ను నేటి నుంచి అందుబాటులోకి తీసుకురానున్నట్లు జిల్లా యువజన క్రీడల అధికారి వెంకటేశ్వర్లు ప్రకటనలో పేర్కొన్నారు. 12 ఏళ్లలోపు చిన్నారులకు రూ.1000 అడ్మిషన్ ఫీజు, నెలకు రూ. 500 ఫీజు ఉంటుందని తెలిపారు. 12 ఏళ్లు దాటిన చిన్నారులు, అలాగే పెద్ద వారికి రూ.1000 అడ్మిషన్ ఫీజు, నెలకు రూ.700 చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఉదయం 6 బ్యాచులు, సాయంత్రం నాలుగు బ్యాచ్‌లకు శిక్షణ ఉంటుందని తెలిపారు. ఔత్సాహికులు ఆధార్ కార్డు జిరాక్స్, రెండు ఫొటోలతో ఈత శిక్షకుడు కొమ్ము కృష్ణను సంప్రదించాలని సూచించారు.

అటోమేటిక్ స్టార్టర్లను తొలగించాలి

- విద్యుత్‌శాఖ ఎస్ఈ సంపత్‌కుమార్

కైలాస్‌నగర్: సాగు కోసం వినియోగించే విద్యుత్ మీటర్లకు సంబంధించిన అటోమేటిక్ స్టార్టర్లను రైతులు స్వచ్ఛందంగా తొలగించాలని విద్యుత్‌శాఖ ఎస్ఈ కె. సంపత్‌కుమార్ ప్రకటనలో కోరారు. వాటిని వినియోగించడం ద్వారా ట్రాన్స్‌ఫార్మర్లపై లోడ్ పెరిగి కాలిపోతున్నాయని పేర్కొన్నారు. తద్వారా రైతులకు, సంస్థకు నష్టం వాటిల్లుతుందని తెలిపారు. అంతిమంగా వినియోగదారులపైనే ఈ ప్రభావం పడుతుందని పేర్కొన్నారు. నాణ్యమైన విద్యుత్ అందాలంటే అటోమేటిక్ స్టార్టర్లను తొలగించాలని సూచించారు. రైతులు గమనించి విద్యుత్‌శాఖకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే ఇళ్లలోనూ నాణ్యమైన 3, 5 స్టార్స్ కలిగిన గృహోపకరణాలనే వినియోగించాలని సూచించారు.

మహిళల ఆరోగ్యంతోనే ఆరోగ్యకర సమాజం

- ఎమ్మెల్యే జోగు రామన్న
- కలెక్టర్‌తో కలిసి 'ఆరోగ్య మహిళ' ప్రారంభం



అసిస్టెంట్ కలెక్టర్ శ్రీజకు వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యురాలు

ఆదిలాబాద్‌టౌన్: మహిళలు ఆరోగ్యంగా ఉంటేనే ఆరోగ్యకర సమాజం ఉంటుందని ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. జిల్లా కేంద్రంలోని హమాలీవాడ పట్టణ ఆరోగ్యకేంద్రంలో కలెక్టర్ రాహుల్‌రాజ్‌తో కలిసి ఆరోగ్య మహిళ కార్యక్రమాన్ని బుధవారం ప్రారంభించారు. వైద్యులు మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడారు. మహిళా దినోత్సవం కానుకగా ప్రభుత్వం ఆరోగ్య మహిళ కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. ఇందులో భాగంగా ప్రతీ మంగళవారం మహిళలకు ఎనిమిది రకాల వైద్య పరీక్షలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలో తొలుత స్థానిక హమాలీవాడ ఆరోగ్య కేంద్రంతో పాటు బజార్‌హత్నూర్ పీహెచ్‌సీలో ఈ సేవలు అందించనున్నట్లు తెలిపారు. అనంతరం అసిస్టెంట్ కలెక్టర్ శ్రీజ, డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు కుమ్ర ఈశ్వరిబాయి మాట్లాడారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ప్రేమేందర్, డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్, మున్సిపల్ కమిషనర్ శైలజ, డిప్యూటీ డీఎంహెచ్‌వో సాధన, వైద్యాధికారులు శ్రీకాంత్, శ్రీధర్, వైద్యశాఖ జాయింట్‌డైరెక్టర్ జాన్‌బాబుపాల్గొన్నారు.

మహిళల అభ్యున్నతికి కృషి

బజార్‌హత్నూర్: మహిళల అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కృషిచేస్తుందని ఎమ్మెల్యే రాథోడ్ బాపూరావ్ అన్నారు. మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో ఆరోగ్య మహిళ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రతీ మంగళవారం నిర్వహించే ఈ కార్యక్రమాన్ని మహిళలంతా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మహిళా ప్రజాప్రతినిధులు, వైద్యులను శాలువాతో సత్కరించారు. అనంతరం మండల కేంద్రంలోని వ్యవసాయ సహకార సంఘం కార్యాలయంలో శనగ కొనుగోలు కేంద్రంను ప్రారంభించారు. కార్యక్రమాల్లో జెడ్పీటీసీ నర్సయ్య, ఎంపీపీ జయశ్రీ, మార్కెట్‌కమిటీ చైర్మన్ రుక్మాన్‌సింగ్, ప్యాక్స్ చైర్మన్ వెంకన్న, సర్పంచ్ లావణ్యాసాయన్న, ఎంపీటీసీ తిరుమల,వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

మహిళల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

- జెడ్పీ చైర్మన్ జనార్దన్ రాథోడ్, ఎమ్మెల్యే జోగు రామన్న
- ఘనంగా మహిళా దినోత్సవం



కేక్ కట్ చేస్తున్న ట్రెయినీ కలెక్టర్ శ్రీజ తదితరులు



ఈశ్వరీబాయిని సన్మానిస్తున్న జెడ్పీ చైర్మన్ జనార్దన్ రాథోడ్, ఎమ్మెల్యే రామన్న, కలెక్టర్ రాహుల్‌రాజ్

కైలాస్‌నగర్: మహిళల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని జెడ్పీ చైర్మన్ జనార్దన్ రాథోడ్, ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవంను జిల్లా కేంద్రంలోని తానీషా గార్డెన్‌లో బుధవారం అధికారికంగా నిర్వహించారు. కలెక్టర్, ఎమ్మెల్యే రామన్నలతో కలిసి ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్మన్ మాట్లాడుతూ, ప్రభుత్వం మహిళల సంక్షేమం అనేక పథకాలను అమలు చేస్తుందని వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అంతేకాకుండా స్థానిక సంస్థల్లో 50శాతం రిజర్వేషన్లను కల్పిస్తుందన్నారు. ఎమ్మెల్యే రామన్న మాట్లాడుతూ మహిళ లేకుంటే సృష్టిలేదన్నారు. ప్రస్తుతం మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారన్నారు. అనంతరం వివిధ రంగాల్లో రాణిస్తున్న మహిళా అధికారులు, ఉద్యోగులు, సిబ్బందితో పాటు పర్వతారోహకురాలు కన్నీబాయిని శాలువాతో సన్మానించారు. విధి నిర్వహణలో అసువులు బాసిన ఆర్మీ జవాన్ భార్య గీతకు మంజూరైన రూ. 3లక్షల చెక్కును అందజేశారు. వడ్డీ లేని రుణాలు రూ.4.71కోట్లు, బ్యాంకు లింకేజీ రూ.23.03కోట్లు, స్త్రీనిధి రుణాలు రూ. 30.50 కోట్లు చెక్కులను మహిళా వికాస జిల్లా సమాఖ్యలకు అందజేశారు. మెప్మాకు సంబంధించి వడ్డీలేని రుణాలు రూ.5.20 కోట్లు, స్త్రీ నిధి రుణాలు రూ. 11.50కోట్ల చెక్కులను పంపిణీ చేశారు. జీవో నం .58 లబ్ధిదారులకు పట్టాలను పంపిణీ చేశారు. అంతకు ముందు ఐసీడీఎస్ అధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాళ్లను పరిశీలించారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, మున్సిపల్ చైర్మన్ ప్రేమేందర్, అదనపు కలెక్టర్లు రిజ్వాన్ బాషాషేక్, నటరాజ్, ట్రెయినీ కలెక్టర్ శ్రీజ, ఆర్డీవో రమేశ్ రాథోడ్, ఏఎస్పీ శ్రీనివాస్, డీఆర్డీవో కిషన్, డీడబ్ల్యూవో మిల్కా, మున్సిపల్ కమిషనర్ శైలజ తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు, లింగనిర్ధారణ చేస్తే జైలుకే..: కలెక్టర్

కలెక్టర్ రాహుల్‌రాజ్ మాట్లాడుతూ, బాల్య వివాహాలు, లింగ నిర్ధారణ చట్టరీత్యా నేరమన్నారు. అలాగే కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ లబ్ధి కోసం కొందరు ఆధార్‌కార్డులో వయసు మార్పు చేస్తున్నారని, ఇలాంటి వారిని జైలుకు పంపిస్తామని హెచ్చరించారు. బాల్య వివాహాలకు బాధ్యులైన పూజారులు, ఖాజీలు, కుటుంబీకులు, వాటిని చూసి పట్టించుకోని అంగన్‌వాడీలపై సైతం ఇవే చర్యలుంటాయన్నారు. లింగ వివక్ష నిర్మూలన ఇంటి నుంచే మొదలు కావాలన్నారు. అత్తలు కోడళ్లను వేధించడం ఆపితే గృహహింసకు తావు లేకుండా ఉటుందన్నారు. ప్రతీ తల్లి తన పిల్లలకు విలువలతో జీవించేలా చిన్నతనం నుంచే నేర్పించాలన్నారు.

సాంకేతిక పరిజ్ఞానం పెంపొందించుకోవాలి

ఆదిలాబాద్‌టౌన్: మహిళా సిబ్బంది సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన పనితనాన్ని పెంపొందించుకోవాలని ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి అన్నారు. మహిళా దినోత్సవం సందర్భంగా ఎస్పీ క్యాంపు కార్యాలయంలో బుధవారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. మహిళా ఉద్యోగులు, సిబ్బంది సమక్షంలో కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మహిళలు పురుషులకు ఏమాత్రం తక్కువగా కాకుండా అన్ని రకాల విధులను సక్రమంగా నిర్వర్తిస్తున్నారని ప్రశంసించారు. కార్యక్రమంలో ఎంటీవో బి.శ్రీపాల్, సీసీ దుర్గం శ్రీనివాస్, పోలీస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, మహిళ ఎస్సైలు రాధిక, అంజమ్మ, పద్మ, ఏఎస్సైలు సునీత, అనిత, సవిత, కవిత, వెంకటమ్మ, హెడ్‌కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు, హోంగార్డులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



మహిళా ఉద్యోగులకు కేక్ తినిపిస్తున్న ఎస్పీ

58 స్వగృహ ప్లాట్లకు మళ్లీ వేలం

- రేపు జెడ్పీలో ప్రీబిడ్ సమావేశం
- డీడీల స్వీకరణకు ప్రత్యేక కౌంటర్లు
- ఏర్పాట్లు చేస్తున్న యంత్రాంగం



బట్టిసావర్గాం శివారులోని స్వగృహ లేఅవుట్

కైలాస్‌నగర్: జిల్లా కేంద్రంలోని రాజీవ్ స్వగృహ లేఅవుట్‌లో ప్లాట్ల విక్రయాల కోసం మరోసారి బహిరంగ వేలం నిర్వహించేందుకు అధికారులు సన్నద్ధమవుతున్నారు. గతేడాది నిర్వహించిన వేలంలో పాట్లు దక్కించుకున్న పలువురు సంబంధిత డబ్బులను గడువులోపు చెల్లించని కారణంగా ఆయా డీడీల సొమ్మును యంత్రాంగం జప్తు చేసింది. అలా మిగిలిపోయిన ప్లాట్లకు ఈనెల 17న మరోసారి వేలం నిర్వహించనున్నారు. అసక్తి గల వారికి వేలం ప్రక్రియకు సంబంధించిన విధి విధానాలపై అవగాహన కల్పించేందుకు ఈ నెల 10న ప్రీబిడ్ సమావేశం నిర్వహిస్తున్నారు.

ఏం జరిగిందంటే..

మావల మండలం బట్టిసావర్గాం శివారులోని సర్వే నంబర్ 71/1/2, 72/1/3లో రాజీవ్ స్వగృహ కార్పొరేషన్‌కు సంబంధించిన 29 ఎకరాల్లో ప్లాట్ల విక్రయాల కోసం ప్రభుత్వం లేఅవుట్‌ను ఏర్పాటు చేసింది. 362 ప్లాట్లను ఏర్పాటు చేసి స్క్వేర్ యార్డ్‌కు కనీస ధర రూ.8వేలుగా నిర్ణయించారు. వీటి విక్రయాల కోసం గతేడాది నవంబర్ 14 నుంచి 19వరకు వేలం నిర్వహించారు. వేలంలో పోటీపడి పలువురు ఆ ప్లాట్లను దక్కించుకున్నారు. వీటి వేలం ద్వారా సర్కారు ఖజానాకు రూ.97.14 కోట్ల ఆదాయం సమకూరింది. ప్లాట్లను దక్కించుకున్న వారు మూడు విడతల్లో మొత్తం డబ్బులను చెల్లించాల్సి ఉంటుంది. అయితే ఇందులో 58 మంది తొలి విడత డబ్బులను చెల్లించలేదు. వారు వేలంలో పాల్గొనేందుకోసం రూ.10వేల చొప్పున చెల్లించిన డీడీల నగదు రూ.5.80లక్షల నగదును అధికారులు జప్తు చేశారు. వారికిచ్చిన తొలి విడత గడువు ముగియడంతో వాటికి మరోసారి వేలం నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది.

10న ప్రీ బిడ్ సమావేశం

ఈ ప్లాట్ల వేలం ప్రక్రియపై ఆశావాహులకు అవగాహన కల్పించేందు కోసం ఈ నెల 10న జెడ్పీ సమావేశ మందిరంలో ప్రీ బిడ్ సమావేశం నిర్వహించనున్నారు. ఇందు కోసం అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ సమావేశం అనంతరం ఆసక్తి గల వారి నుంచి దరఖాస్తులు స్వీకరించేలా కలెక్టరేట్‌లో మరోసారి ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేయనున్నారు. అయితే గతంలో జరిగిన వేలం ప్రక్రియ కేంద్రం వద్ద బ్యాంకర్లు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి రుణాలిస్తామని ప్రకటించారు. అయితే వారిపై నమ్మకంతో ప్లాట్లను దక్కించుకున్న వారు చివరకు బ్యాంకర్లు రుణాలు ఇవ్వకపోవడంతో డబ్బులు చెల్లించలేక ప్లాట్లను కోల్పోవాల్సి వచ్చింది. అలాంటి వారికి సైతం మరోసారి అవకాశం కల్పించనున్నారు. ప్రస్తుతం ప్రైవేట్ బ్యాంకులు రుణలు ఇస్తుండటంతో వారికి మేలు చేకూరే అవకాశముంది.

సద్వినియోగం చేసుకోవాలి

సొంతింటి కల సాకారం చేసుకోవాలనే వారికి ప్రభుత్వ స్వగృహ లేఅవుట్‌లో ప్లాట్ల విక్రయం మంచి అవకాశం. ఈ ప్లాట్లను పొందాలనుకునే వారు రూ.10వేల డీడీ చెల్లించి వేలంలో పాల్గొనవచ్చు. లే అవుట్, వేలం ప్రక్రియపై ఏమైనా సందేహాలుంటే వాటిని ప్రీబిడ్ సమావేశానికి హాజరై నివృత్తి చేసుకోవచ్చు. లేఅవుట్లో అన్ని సౌకర్యాలు కల్పించే దిశగా కార్పొరేషన్‌కు ప్రతిపాదనలు పంపించాం. అన్ని వసతులు సమకూరుతాయి. ఆసక్తి గల వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

– రిజ్వాన్ బాషా షేక్, అదనపు కలెక్టర్

క్లుప్తంగా

కూతుర్ని తీసుకొస్తుండగా..

- గుర్తు తెలియని వాహనం ఢీకొని తండ్రీకూతుర్లకు గాయాలు
- చికిత్స పొందుతూ తండ్రి మృతి


షేక్ హుస్సేన్ (ఫైల్)

లోకేశ్వరం: గుర్తు తెలియని వాహనం ఢీకొన్న సంఘటనలో తండ్రి మృతిచెందగా కూతురుకు తీవ్ర గాయాలైన సంఘటన బుధవారం వెలుగు చూసింది. ఎస్సై సాయికుమార్ వివరాల ప్రకారం... మండల కేంద్రానికి చెందిన షేక్ హుస్సేన్(57) పాత ఇనుప సామాన్లు కొనుగోలు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. మంగళవారం అత్తగారింటి నుంచి కూతురు వస్తుందని తెలిసి నిర్మల్‌కు తన బైక్‌పై వెళ్లాడు. కూతురు లాల్‌బి, మనవరాలును తీసుకుని బైక్‌పై నిర్మల్ నుంచి లోకేశ్వరం బయలుదేరాడు. మండలంలోని హవర్గ గ్రామ సమీపంలోని అర్లి వంతెన వద్ద గుర్తు తెలియని వాహనం వీరి బైక్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో షేక్ హుస్సేన్, లాల్‌బీ తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు వారిని 108లో భైంసా ఏరియా ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం నిజామాబాద్ జిల్లా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి బుధవారం మృతిచెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య


నరేశ్ మృతదేహం

లక్ష్మణచాంద: ఆర్థిక ఇబ్బందులతో యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన సోన్ మండలంలోని న్యూబొప్పారం గ్రామంలో బుధవారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం... నరేశ్ (30) బొప్పారం గ్రామంలో ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నాడు. సెంటర్ సక్రమంగా నడవకపోవడంతో అప్పులు పెరిగాయి. వాటిని ఎలా తీర్చాలో తెలియక తీవ్ర మనస్తాపానికి గురై బుధవారం న్యూవెల్మల్ గ్రామ శివారులోని సరస్వతీ కాలువ సమీ పంలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడికి భార్య, మూడు నెలల కుమారుడు ఉన్నాడు. భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రవీందర్ తెలిపారు.

రూ.25లక్షలతో వ్యాపారి పరారీ

ముథోల్: మండలంలోని విఠోలి గ్రామ సమీపంలో మైనింగ్ కంపెనీలో ఇన్‌చార్జి వ్యాపారిగా నెల్లూరు జిల్లాకు చెందిన అశోక్ కొనసాగిస్తున్నాడు. ఈ క్రమంలో ముథోల్ మండలానికి చెందిన దప్కల్ విఠల్ వద్ద నుంచి రూ.3.50లక్షలు, అస్‌లామ్ వద్ద రూ.13 లక్షలు, జీకే పెట్రోల్‌లో రూ.లక్షా 10వేలు, ఇండియన్ పెట్రోల్ బంక్‌లో రూ.7లక్షలు గత 20రోజుల క్రితం తీసుకున్నాడు. అప్పటి నుంచి కనిపించకుండా పోయాడు. దీంతో సదరు బాధితులు ఐదు రోజుల క్రితం నెల్లూరు జిల్లాకు వెళ్లి అతడి ఇంటి వద్ద వాకబ్ చేశారు. అతడి భార్య ఇంటికి రాలేదని సమాధానం ఇచ్చింది. దీంతో చేసేది లేక బుధవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో బాధితులు ఫిర్యాదు చేశారు.

ఉత్తమ ఫలితాల కోసం..


కాంప్లిమెంటరీ బృందాలతో విద్యార్థులకు అవగాహన

- వంద శాతం ఉత్తీర్ణతకు చర్యలు
- లక్ష్యం దిశగా మిషన్ లక్ష్యం
- సత్ఫాలితాలిస్తున్న అభ్యాసదీపికలు

ఉట్నూర్: పదో తరగతి వార్షిక పరీక్షల్లో వంద శాతం ఫలితాలు సాధించేందుకు గిరిజన సంక్షేమశాఖ ప్రత్యేక చర్యలు చేపడుతోంది. ఇప్పటికే మిషన్ లక్ష్యం అమలు చేస్తుండగా విద్యార్థులకు ప్రత్యేకంగా రూపొందించిన అభ్యాస దీపికలు అందించడంతో పాటు విద్యార్థుల చదువులపై ప్రత్యేక దృష్టి సారించింది. అంతేకాకుండా కాంప్లిమెంటరీ బృందాలను ఏర్పాటు చేసి విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తోంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 132 ఆశ్రమ పాఠశాలలుండగా దాదాపు 34వేలకు పైగా గిరిజన విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. వీరిలో వచ్చే పదో తరగతి వార్షిక పరీక్షల్లో 3851 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. ఇందులో ఆదిలాబాద్ జిల్లాలో 1735 మంది విద్యార్థులు, ఆసిఫాబాద్ జిల్లాలో 1248 మంది విద్యార్థులు, నిర్మల్ జిల్లాలో 452 మంది విద్యార్థులు, మంచిర్యాల జిల్లాలో 416 మంది విద్యార్థుల చొప్పున హాజరు కానున్నారు.

ఫలితాల సాధనకు మిషన్ లక్ష్యం...

పదో తరగతి వార్షిక పరీక్షల్లో వందశాతం ఫలితాలు సాధనే లక్ష్యంగా ఐటీడీఏ గిరిజన సంక్షేమ శాఖ ద్వారా గత డిసెంబర్ 7వ తేదీ నుంచి వందరోజుల మిషన్ లక్ష్యం కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఈ కార్యక్రమంలో భాగంగా వంద రోజుల పాటు పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతుల నిర్వహణ, ప్రతి రోజు ఉదయం గంట పాటు నాలెడ్జ్ అసిస్‌మెంట్, పరీక్షల నిర్వహణతో విద్యార్థులను తీర్చిదిద్దుతున్నారు. అంతేకాకుండా పాఠ్యాంశాల వారీగా ప్రత్యేకంగా ప్రశ్నాపత్రాలు ముద్రించి గ్రేడ్‌ల వారీగా విద్యార్థులను విభజించి టెస్టులు నిర్వహించడం, వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారిస్తూ వారిని వార్షిక పరీక్షలకు సిద్ధం చేస్తున్నారు. ఉపాధ్యాయులకు విద్యార్థులను గ్రూపులుగా దత్తత ఇవ్వడం, కార్పొరేట్ స్థాయిలో జవాబు పత్రాలు ముద్రించి విద్యార్థులతో అభ్యసనం చేయించడంతో మంచి ఫలితాలు సాధిస్తున్నారు. విద్యార్థులకు ప్రత్యేకంగా అభ్యాస దీపికలు అందించి పరీక్షలకు సిద్ధం చేస్తున్నారు.


విద్యార్థులకు అందించిన అభ్యాస దీపికలు

కాంప్లిమెంటరీ బృందాలు..

ఏప్రిల్ 3వ తేదీ నుంచి ప్రారంభమయ్యే పదో తరగతి వార్షిక పరీక్షల్లో ఈసారి 11పేపర్లకు బదులుగా ఆరు పేపర్ల విధానాన్ని ప్రభుత్వం అమలు చేస్తుండడంతో పరీక్షలపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు గిరిజన సంక్షేమశాఖ 14 కాంప్లిమెంటరీ బృందాలను ఏర్పాటు చేసింది. ఈ బృందాల సభ్యులు విద్యార్థులకు పరీక్షా విధానం, నూతన మాదిరి ప్రశ్నాపత్రాలతో పరీక్షలు ఎలా రాయాలి, పరీక్ష రాసే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమాలను ఆశ్రమ పాఠశాలల వారీగా ఈ నెల 4వ తేదీ నుంచి 9వ తేదీ వరకూ నిర్వహించాయి.

నిర్మాణ్ సంస్థ ద్వారా అవగాహన

పదో తరగతి అనంతరం విద్యార్థులు భవిష్యత్‌లో ఉన్నత స్థానాలకు ఎదిగేందుకు ఉన్నత విద్య కోసం ఎలాంటి కోర్సులు ఎంచుకోవాలి. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు సాధించేందుకు ఎలా ముందుకు సాగాలి తదితర అంశాలపై పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేకంగా అవగాహన కల్పిస్తూ వారిలో ఆత్మవిశ్వాసం పెంపొందించేందుకు నిర్మాణ్ సంస్థ ద్వారా గిరిజన విద్యార్థులకు ప్రత్యేకంగా అవగాహన తరగతులు నిర్వహిస్తున్నారు.


ఉన్నత విద్య కోసం విద్యార్థులకు అవగాహన

పరీక్ష సామగ్రి... ప్రత్యేక మెనూ..

వార్షిక పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు గిరిజన సంక్షేమ శాఖ ప్రత్యేక మెనూ అమలు చేయడంతో పాటు సూపర్‌విజన్ తరగతుల సమయంలో విద్యార్థులు అలసిపోకుండా పాలు, స్నాక్స్, టీతో పాటు ప్రత్యేక పోషకాహారం అందించనున్నారు. అంతేకాకుండా పరీక్షలు రాసే ప్రతి విద్యార్థికి చేతి గడియారం, జామెట్రీ బాక్స్, పరీక్ష ప్యాడు, పెన్నులు, లాంగ్ స్కెల్‌లను ప్రత్యేకంగా అందించనున్నారు.

నిరంతరం పర్యవేక్షణ



వచ్చే పదో తరగతి వార్షిక పరీక్షల్లో గిరిజన విద్యార్థులు వంద శాతం ఫలితాలు సాధించేలా నిరంతరం పర్యవేక్షణ చేస్తున్నాం. మిషన్ లక్ష్యం అమలుతో పాటు ఇతర ప్రత్యేక చర్యల ద్వారా విద్యార్థులను వార్షిక పరీక్షలకు సిద్ధం చేస్తున్నాం. అంతేకాకుండా భవిష్యత్‌లో ఉన్నత విద్యాభ్యాసన కోసం ఎలా ముందుకు సాగాలి తదితర అంశాలపై నిర్మాణ్ సంస్థ ద్వారా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం.

– జగన్, అకాడమిక్ మానిటరింగ్ అధికారి ఐటీడీఏ

యువతి అదృశ్యం

నర్సాపూర్(జి): మండల కేంద్రానికి చెందిన బొమ్మెన సంగీత -శ్రీనివాస్ దంపతుల పెద్ద కూతురు బొమ్మెన లక్ష్మిప్రసన్న(19) నిర్మల్ జిల్లా కేంద్రంలోని జీఎస్‌ఆర్ డిగ్రీ కళాశాలలో ప్రథమ సంవత్సరం చదువుతోంది. మంగళవారం రాత్రి సుమారు 9.30 గంటల నుంచి కనిపించకుండా పోవడంతో కుటుంబ సభ్యులు తెలిసిన చోట్ల వెతికారు. ఆచూకీ తెలియకపోవడంతో బుధవారం పోలీస్‌స్టేషన్‌లో యువతి తల్లి బొమ్మెన సంగీత ఫిర్యాదు చేసింది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై దేవేందర్‌గౌడ్ పేర్కొన్నారు.

ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఆత్మహత్య

జైనథ్: మండలంలోని ఆనంద్‌పూర్ గ్రామానికి చెందిన తిప్పిరెడ్డి అశోక్‌రెడ్డి(45) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. అశోక్‌రెడ్డి కొన్నేళ్లుగా ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడు. ఈ క్రమంలో మద్యానికి బానిసయ్యాడు. బుధవారం ఉదయం చేనుకు వెళ్లి పురుగుల మందు తాగాడు. ఇదే విషయం తన సోదరునికి ఫోన్‌లో సమాచారం అందించాడు. కుటుంబీకులు 108లో జిల్లా కేంద్రంలోని రిమ్స్‌కు తరలించారు. కాగా, అప్పటికే ఆయన మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతుడి భార్య లింగమ్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మద్యం మైకంలో యువకుడి ఆత్మహత్య

జైనథ్: బేల మండలం బెదోడ గ్రామానికి చెందిన కె.స్వామి(28) జీవితంపై విరక్తితో ఆత్మహత్యకు పాల్పడినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. పోలీసుల వివరాల ప్రకారం... స్వామి రెండేళ్లుగా మద్యానికి బానిసయ్యాడు. మంగళవారం పండుగ సందర్భంగా మద్యం తాగి ఇంటికి వచ్చాడు. కుటుంబ సభ్యులు తాగుడు బంద్‌చేయాలని మందలించారు. దీంతో మనస్తాపానికి గురైన స్వామి మండలంలోని ఖాప్రి సమీపంలోని పాత వంతెన వద్ద తాగిన మైకంలో పురుగుల మందుతాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్‌కు తరలించారు. మృతుడి తండ్రి ఆత్మరాం ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గొడవ ఆపేందుకు వెళ్లి..

ప్రాణాలు పోగొట్టుకున్న బాలుడు

- హోలీ రోజు కొలాంగూడలో విషాదం
- మద్యం మత్తులో ఇద్దరు మైనర్ల గొడవ..
- అడ్డుకునేందుకు వెళ్లిన బాలుడు
- తోసివేయడంతో సీసీరోడ్డుపై పడిన వైనం..


భీంరావు (ఫైల్)

నార్నూర్: హోలీ పండుగపూట మండలంలోని కొత్తపల్లి - హెచ్ కొలాంగూడలో మంగళవారం తీవ్ర విషాదం నెలకొంది. సీఐ ప్రేమ్‌కుమార్ వివరాల ప్రకారం... మంగళవారం రాత్రి గ్రామంలో ఇద్దరు బాలురు మద్యం మత్తులో గొడవ పడ్డారు. ఆ గొడవ ముదరడంతో అక్కడే ఉన్న కొడప దేవురావు (15) ఇరువురికి నచ్చజెప్పే ప్రయత్నం చేశాడు. వారు నెట్టివేయడంతో పక్కనే ఉన్న సీసీ రోడ్డుపై దేవురావు పడిపోయాడు. తలకు తీవ్రంగా దెబ్బ తగలడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. బాలుడి మృతికి కారణమైన ఇరువురిని బుధవారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మృతుడి తండ్రి సోనేరావు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

చేపలవేటకు వెళ్లి జాలరి మృతి


తోకల నరేశ్ (ఫైల్)

లోకేశ్వరం: మండలంలోని సాథ్గాం గ్రామానికి చెందిన జాలరి గోదావరిలో ప్రమాదశాత్తు నీట మునిగి మృతిచెందిన సంఘటన బుధవారం చోటుచేసుకుంది. ఎస్సై సాయికుమార్ వివరాల ప్రకారం... నరేశ్(25) చేపల వేటకు వెళ్లి కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఎప్పటి మాదిరిగానే బుధవారం తెల్లవారు జామున ఇంటి నుంచి వలలు తీసుకుని గోదావరి నదిలోకి వెళ్లాడు. సాయంత్రం ఇంటికి రాకపోవడంతో కుటుంబీకులు గాలింపు చేపట్టారు. గోదావరి ఒడ్డున బైక్, దుస్తువులు కనిపించడంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు చేరుకుని గోదావరిలో గాలింపు చర్యలు చేపట్టి మృతదేహాన్ని బయటకు తీశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి భార్య హరీష, రెండేళ్ల కూతురు ఉన్నారు.

వాచ్‌మన్ హత్య

- బంధువుల ఆందోళన
- సంఘటన స్థలంలో స్వల్ప ఉద్రిక్తత
- పరిశీలించిన ఎస్పీ, ఏఎస్పీ


షేక్ అహ్మద్ (ఫైల్)

భైంసాటౌన్: పట్టణంలోని భోకర్ రోడ్డులోని ఓ ఫ్యాక్టరీలో వాచ్‌మెన్ హత్యకు గురైన సంఘటన బుధవారం వెలుగు చూసింది. పోలీసుల కథనం ప్రకారం.. సిరాల గ్రామానికి చెందిన షేక్ అహ్మద్(60) భైంసాలోని ఓ ఫ్యాక్టరీలో కొద్దికాలంగా వాచ్‌మన్‌గా పనిచేస్తున్నాడు. బుధవారం సాయంత్రం స్థానిక పశువుల కాపర్లు మృతదేహం గమనించి పోలీసులకు సమాచారమిచ్చారు. దీంతో ఎస్పీ ప్రవీణ్‌కుమార్, ఏఎస్పీ కాంతిలాల్ పాటిల్, సీఐ ఎల్. శ్రీను చేరుకుని సంఘటనాస్థలాన్ని పరిశీలించారు. డాగ్ స్క్వాడ్‌తో ఆధారాల కోసం పరిశీలించారు. విషయం తెలుసుకున్న మృతుడి కుటుంబీకులు సంఘటనా స్థలానికి చేరుకుని ఇది హత్యేనంటూ ఆరోపించారు. నిందితులను గుర్తించి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. మృతదేహాన్ని కదలనివ్వబోమని పట్టుబట్టడంతో కొంతసేపు స్వల్ప ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. అనంతరం పోలీసులు వారిని సముదాయించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నిర్మల్ ఆస్పత్రికి తరలించారు. ఏఎస్పీ కాంతిలాల్ పాటిల్ మాట్లాడుతూ.. ఫ్యాక్టరీలో పనిచేసే కొందరు బిహార్ కూలీలు పరారీలో ఉన్నారని, వారే మంగళవారం రాత్రి హత్య చేసి ఉంటారని, పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

చోరీ కేసును ఛేదించిన పోలీసులు


వివరాలు వెల్లడిస్తున్న ఏఎస్పీ

ముథోల్: మండలంలోని ముద్గల్ గ్రామంలో జరిగిన చోరీ కేసును పోలీసులు వారంరోజుల్లో ఛేదించారు. మండల కేంద్రంలో సర్కిల్ కార్యాలయంలో బుధవారం భైంసా ఏఎస్పీ కాంతిలాల్ పాటిల్ వివరాలు వెల్లడించాడు. మండలంలోని ముద్గల్ గ్రామానికి చెందిన టోక్రేకర్ లత గత నెల 21వ తేదీన భర్త చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ఆస్పత్రికి ఇంటికి తాళం వేసి వెళ్లింది. గమనించిన అదే గ్రామానికి చెందిన టోక్రేకర్ శుద్ధోదన్ మార్చి 01న రాత్రి తాళం పగలగొట్టి ఇంట్లోకి ప్రవేశించి ఇనుపపెట్టెలోని రూ.లక్షా 20 వేల నగదు దొంగిలించాడు. మరుసటి రోజు విషయం తెలుసుకున్న లత ఇంటికి చేరుకుని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఎస్సై తిరుపతి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. నిందితుడు దొంగిలించిన డబ్బును తన ఇంట్లో దాచిపెట్టి మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా భోకర్ తాలుక నాంద గ్రామంలోని అత్తింటికి వెళ్లాడు. బుధవారం ఉదయం మండలంలోని సరస్వతీనగర్ ఎక్స్‌రోడ్డు వద్ద పోలీసులు వాహనాల తనిఖీలు చేపట్టగా అనుమానాస్పదంగా తిరుగుతున్న శుద్ధోదన్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా అసలు నిజం ఒప్పుకున్నాడు. దీంతో అతడిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపుతున్నట్లు ఏఎస్పీ తెలిపారు. చోరీ కేసును ఏడు రోజుల్లో ఛేదించిన ఎస్సై తిరుపతిని, సిబ్బందిని ఏఎస్పీ అభినందించారు. సమావేశంలో సీఐ వినోద్‌రెడ్డి, పోలీస్ సిబ్బంది లక్ష్మారెడ్డి, చారి, లయక్ ఉన్నారు.

నిర్మల్ జెడ్పీ చైర్‌పర్సన్‌కు మంత్రి పరామర్శ


నివాళులర్పిస్తున్న మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి

నేరడిగొండ: నేరడిగొండ మండలం తర్నం గ్రామానికి చెందిన నిర్మల్ జిల్లా జెడ్పీ చైర్‌పర్సన్ కొరిపెల్లి విజయలక్ష్మి తండ్రి ఎర్ర గంగారెడ్డి ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. బుధవారం రాష్ట్ర మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. మంత్రి వెంట జెడ్పీటీసీ అనిల్ జాదవ్, ఎంపీపీ రాథోడ్ సజన్, నాయకులు అల్లోల మురళీధర్‌రెడ్డి, నిర్మల్ ఆత్మ చైర్మన్ గంగారెడ్డి, ఎంపీపీ మహిపాల్ రెడ్డి, నాయకులు గాదె శంకర్, డాక్టర్ జహీర్, శివారెడ్డి, విశాల్, అడెల్లు ఉన్నారు.

వేర్వేరు గ్రామాల్లో ఇద్దరి మృతదేహాలు లభ్యం

- ఒకరిది ఆత్మహత్య... మరొకరిది ప్రమాదం
- ఇద్దరివి మిస్సింగ్ కేసులే



ఠాకూర్ తులసీరాం(ఫైల్) నామద్కర్ దిలీఫ్(ఫైల్)

కుభీర్: మండలంలోని జుమ్డా గ్రామానికి చెందిన ఠాకూర్ తులసీరాం(60), పాగ్ర గ్రామానికి చెందిన నామద్కర్ దిలీప్ (24) ఇద్దరు కనిపించకుండా పోయినట్లు కుటుంబీకులు వేర్వేరుగా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదులు చేయగా మిస్సింగ్ కేసులు నమోదయ్యాయి. వారి మృతదేహాలను బుధవారం పోలీసులు గుర్తించారు.

కొడుకు మరణం జీర్ణించుకోలేక..

మండలంలోని జుమ్డా గ్రామానికి చెందిన ఠాకూర్ తులసీరాం(60) అతడి కుమారుడు బజరంగ్‌సింగ్ రెండేళ్ల క్రితం గుండెపోటుతో మృతిచెందాడు. అప్పటి నుంచి మనస్తాపానికి గురయ్యాడు. ఫిబ్రవరి 22న బంధువుల పెళ్లికి వెళ్లాడు. ఆ మరుసటి రోజు నుంచి కనిపించకుండా పోయాడు. గత నెల 24న బంధువులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా మిస్సింగ్ కేసు నమోదు చేశారు. బుధవారం చొండి శివారులో చెట్టుకు ఉరేసుకుని శవం కనిపించడంతో సమాచారం మేరకు పోలీసులు చేరుకుని తులసీరాం మృతదేహంగా గుర్తించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఎండీ.షరీఫ్ తెలిపారు.

ప్రమాదవశాత్తు చెరువులో పడి...

పాంగ్ర గ్రామానికి చెందిన నామద్కర్ దిలీఫ్ (24) గత నెల 8న బహిర్భూమికి వెళ్లాడు. అప్పటి నుంచి కనిపించకుండా పోయాడు. దీంతో కుటుంబీకులు ఆ మరుసటి రోజు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా మిస్సింగ్ కేసు నమోదైంది. బుధవారం పాంగ్ర చెరువులో మృతదేహం కనిపించింది. పోలీసులు చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి దిలీఫ్‌గా గుర్తించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

యువతి మృతి


మార్శెట్టి శ్రీలత (ఫైల్)

జైనథ్: మండలంలోని బెల్లూరి గ్రామానికి చెందిన మార్శెట్టి బాపన్న, విఠాబాయిల చిన్న కూతురు మార్శెట్టి శ్రీలత (22) చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందింది. స్థానికుల కథనం ప్రకారం... శ్రీలత తన అక్కా, బావలతో కలిసి మహారాష్ట్రలోని పాటన్‌కు పుట్టిన రోజు వేడుకల కోసం మంగళవారం బంధువుల ఇంటికి వెళ్లింది. తిరుగు ప్రయాణంలో అక్క భర్త తోట మహేష్‌తో కలిసి బైక్‌పై వస్తుండగా చీకటి పడడంతో రోడ్డుకు అడ్డంగా వచ్చిన పందిని బైక్ ఢీకొంది. ఈ ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. శ్రీలత తల భాగంలో తీవ్ర గాయాలు కాగా జిల్లా కేంద్రంలోని రిమ్స్‌కి తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందింది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించినట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు


సంఘటనా స్థలంలో క్షతగాత్రుడు

కడెం: మండలంలోని ధర్మాజీపేట్ గ్రామ సమీపంలో బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. ఖానాపూర్ నుంచి కడెం వైపు వస్తుండగా ధర్మాజీపేట్ మూలమలుపు వద్ద బైక్ అదుపుతప్పి చెట్టును ఢీకొంది. ఈ ప్రమాదంలో గుర్తు తెలియని యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని స్థానికులు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. యువకుడిది మామడ మండలం దిమ్మదుర్తిగా సమాచారం.

హత్యాయత్నం కేసులో నలుగురి అరెస్టు

నిర్మల్‌టౌన్: హత్యాయత్నం కేసులో నలుగురిని అరెస్టు చేసినట్లు పట్టణ సీఐ మల్లేశ్ తెలిపారు. వివరాల ప్రకారం...హోలీ పండుగ సందర్భంగా మంగళవారం రాత్రి జిల్లా కేంద్రంలోని రాంనగర్‌కు చెందిన ఆరుగురు వ్యక్తులు అదే కాలనీ చెందిన బొట్టు రాకేష్ కుటుంబంపై దాడి చేశారు. ఇందులో రాకేశ్, మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. వారిని చికిత్స నిమిత్తం స్థానికులు ఆసుపత్రికి తీసుకెళ్లారు. బాధితుల ఫిర్యాదు మేరకు పవార్‌భరత్, నవడే ప్రభు, రామేశ్వర్, పవార్ సాయి కృష్ణ అనే నలుగురిని బుధవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. మరో ఇద్దరు పరారీలో ఉన్నారు.

ఈదురుగాలులకు నేలకొరిగిన మొక్కజొన్న


నేలకొరిగిన పంట చూపుతున్న రైతు దిగంబర్


నేలకొరిగిన దొంతుల గంగాధర్ పంట

కుభీర్: మండలంలోని వివిధ గ్రామాల్లో బుధవారం ఈదురుగాలులతో మొక్కజొన్న పంట నేలకొరిగింది. దీంతో చేతికి వచ్చిన పంట పడిపోవడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. కుభీర్‌కు చెందిన దొంతుల గంగాధర్‌కు చెందిన రెండు ఎకరాల మొక్కజొన్న, బాల దిగంబర్‌కు చెంది ఎకరం పంట నేలకొరిగింది. అదేవిధంగా దార్‌కుభీర్, రాజురా గ్రామాల్లోనూ మొక్కజొన్న పడిపోయినట్లు రైతులు వాపోతున్నారు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.